క్లుప్తంగా

అమ్మవారి ఆలయాల్లో పూజలు



కునుకుంట్లలో పూజలందుకున్న యల్లమ్మ తల్లి

తాడిమర్రి: వైశాఖ మాసం పురస్కరించుకుని తాడిమర్రి పెద్దమ్మ, పెద్దకోట్ల చౌడేశ్వరి, కునుకుంట్ల యల్లమ్మ, ఓసూరమ్మ, పెద్దమ్మ, నార్శింపల్లి నల్లలమ్మ, దాడితోట గంగమ్మల ఆలయాల్లో పూజారులు అమ్మవారి మూలవిరాట్‌లను వెండి ఆభరణాలు, పూలమాలతో అలంకరించారు. ఈ సందర్భంగా పూజలు నిర్వహించారు.అనంతరం అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవార్లకు కొబ్బరి కాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

నేడు భూముల వేలం

తలుపుల: ఓబుళేశ్వర స్వామి మాన్యం భూములను కౌలుకు ఇచ్చేందుకు గంజివారిపల్లి గ్రామంలోని మండల పరిషత్ హైస్కూల్‌లో సోమవారం దేవదాయ శాఖ ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఈఓ రామాంజనేయులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు రూ.5 వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చన్నారు. సర్వే నంబర్ 901లోని 66 ఎకరాల భూమిని కౌలుకు ఇవ్వడం జరుగుతుందన్నారు.

ఉచిత కంటి ఆపరేషన్లతో పేదలకు కంటి చూపు



కంటి పరీక్షలు చేస్తున్న బెంగళూరు శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులు

ధర్మవరం అర్బన్: ఉచిత కంటి ఆపరేషన్లతో వేలాది మంది నిరుపేదలకు కంటి చూపును అందిస్తున్నామని రోటరీక్లబ్ అధ్యక్షుడు కృష్ణమూర్తి, కార్యదర్శి రామకృష్ణ తెలిపారు. పట్టణంలోని కోట మున్సిపల్ పాఠశాలలో ఆదివారం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. బెంగళూరు శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులు కంటి చూపు తగ్గిన వారికి కంటి పరీక్షలు చేశారు. వైద్య శిబిరంలో 278 మంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. కంటి ఆపరేషన్లకు 192 మందిని ఎంపిక చేశారు. కంటి ఆపరేషన్లను కూడా బెంగళూరుకు తీసుకెళ్లి చేయిస్తామని రోటరీక్లబ్ సభ్యులు తెలిపారు. అనంతరం వైద్య శిబిరం దాతలను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో రిటైర్డ్ కంటి వైద్యాధికారి నరసింహులు, రోటరీక్లబ్ సభ్యుడు, క్యాంప్ చైర్మన్ నాగభూషణ, నరేంద్ర రెడ్డి, శ్రీనివాసరెడ్డి, రత్నశేఖర్ రెడ్డి, శివయ్య, సోలిగాళ్ల వెంకటేశులు, సుదర్శన్ గుప్తా, సత్రసాల ప్రసన్నకుమార్, మనోహర్ గుప్తా, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



అశ్వర్థమ్మ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

నల్లమాడ: వైఎస్సార్‌సీపీ మండల మాజీ కన్వీనర్ పారకల రామాంజనేయులు తల్లి పి.అశ్వర్థమ్మ (75) రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆదివారం మృతురాలి ఇంటికి వెళ్లి ఆమె భర్త పారకల వెంకటనారాయణ, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనారోగ్యానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కుళ్లాయినాయక్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి టీడీ కేశవరెడ్డి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పారకల రమణ, గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తనకల్లు: స్థానిక ఇందిరానగర్‌లో నివాసముంటున్న గొంది నరసింహులు (గణపతి) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సంగతి తెలిసిందే. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి మృతుడి కుటుంబానికి రూ.10 వేల ఆర్థికసాయం చేశారు. ఎమ్మెల్యే ఆదేశాలతో ఆ మొత్తాన్ని ఆదివారం వైఎస్సార్‌సీపీ నాయకులు మృతుడి భార్యకు అందించారు. కార్యక్రమంలో నాయకులు బీఎస్ నిజాం, ఎస్సీ సెల్ నాయకులు శ్రీనివాసులు, చంద్ర, గంగాధర్, తిమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మార్మోగిన హనుమాన్ నామసర్మణ

తాడిమర్రి: మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. హనుమాన్ జయంతిని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక తూర్పుముఖ ఆంజనేయస్వామి, మద్దుల చెర్వు, పత్రపల్లి, నిడిగల్లు, పుల్లంపల్లి తదితర గ్రామాల్లోని ఆలయాలను గ్రామస్తులు మామిడి ఆకుల తోరణాలు, కొబ్బరి, అరటి ఆకులతో అందంగా అలంకరించారు. అనంతరం ఆలయ పూజారులు ఆంజనేయస్వామి విగ్రహాలకు ఆకుపూజ కట్టి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి, మొక్కులు తీర్చుకున్నారు.

ముదిగుబ్బ: మండలంలోని జిల్లేడు బండ డ్యాం మీద వెలసిన పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయంలో ఆదివారం హనుమాన్ జయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముదిగుబ్బ పాతూరులో సూర్య చంద్ర అభయాంజనేయ స్వామి సన్నిధిలో కేక్ కట్ చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

మల్కాపురంలో అన్నదానం

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని మల్కాపురం, గొట్లూరు, నిమ్మలకుంట, నాగలూరు తదితర గ్రామాల్లో ఆదివారం హనుమాన్ జయంతిని భక్తులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అభిషేకం, ఆకుపూజలు, మహా మంగళ హారతి తదితరలు కార్యక్రమాలు చేపట్టారు. మల్కాపురం గ్రామంలో ధర్మవరం అన్నమయ్య సేవా మండలి ఆధ్వర్యంలో అన్నమయ్య సంకీర్తనలు ఆలపించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కేతిరెడ్డి

ధర్మవరం: హనుమాన్ జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని కొత్తపేట సీతారామాంజనేయ స్వామి ఆలయంలో ఆదివానం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు ఎమ్మెల్యే కేతిరెడ్డికి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆంజనేయస్వామికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేయించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తలుపుల: మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో ఆదివారం హనుమాన్ జయంతిని జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆంజనేయుడికి కుంకుమార్చన, ఆకుపూజ, పంచామృతాభిషేకం చేశారు.



కదిరి అర్బన్: పట్నంలో అలంకరణలో ఆంజనేయుడు



కదిరి టౌన్: ప్రత్యేక అలంకరణలో ద్వారం ఆంజనేయుడు



నల్లమాడ: పూజలందుకున్న పెద్దకోట్లపల్లి ఆంజనేయ స్వామి



పుట్టపర్తి అర్బన్: పూజలు నిర్వహిస్తున్న పురోహితుడు

అనంతరం భక్తులకు ప్రసాదం, అన్నదానం చేశారు.

నల్లచెరువు: పాలపాటి దిన్నె ఆంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ జయంతి సందర్భంగా ఆదివారం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. హనుమాన్ ఉత్సవ విగ్రహాన్ని ఆలయ ప్రాంగణంలో చుట్టూ ప్రాకారోత్సవం చేపట్టారు. కదిరి నూతన సీనియర్ సివిల్ జడ్జి జయలక్ష్మి, సునిల్ దంపతులు స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ దేవరింటి భాస్కర్‌రెడ్డి స్వాగతం పలికి, స్వామి చిత్రపటాన్ని అందజేశారు. దేశాయి సుబ్బారెడ్డి ఆసుపత్రి అధినేత డాక్టర్ నాగేంద్ర కుమార్ రెడ్డి, అరుణ దంపతులు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. దేవాలయ ప్రాంగణంలో రేకుల షెడ్డు నిర్మాణానికి పి.కొత్తపల్లికి చెందిన గోవిందు, చంద్రశేఖర్‌రెడ్డి, రూ.2 లక్షల నగదును పాలక మండలి సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో గోవిందు రెడ్డి, సూర్య నారాయణ, రామచంద్ర, ఆంజనేయ దాసు, ఉత్తన్న తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం అర్బన్: పట్టణంలోని లింగిశెట్టిపాలెం అభయాంజనేయ స్వామి, కొత్తపేట సీతారామంజనేయస్వామి, తేరుబజార్‌లోని శ్రీరామమందిరం, చెరువుకట్ట వద్ద ఆంజనేయస్వామి, దుర్గానగర్ ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. కాలభైరవస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

కదిరి టౌన్: హనుమాన్ జయంతి సందర్భంగా పట్టణంలోని సైదాపురం ఆంజనేయస్వామి ఆలయం, మారుతినగర్‌లో ఉన్న పంచముఖ ఆంజనేయస్వామి ఆలయాల్లో పూజలు చేపట్టారు.

ఓడీ చెరువు: ఓడీ చెరువు, గాజుకుంటపల్లి గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో ఆదివారం హనుమాన్ జయంతిని సందర్భంగా ఆకుపూజ, అభిషేకాలు నిర్వహించారు. హనుమాన్ చాలీసా పఠించారు.

పుట్టపర్తి అర్బన్: హనుమజ్జయంతిని పురస్కరించుకుని గంగిరెడ్డిపల్లి ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం భక్తులకు ప్రసాదం అందజేశారు.

పుట్టపర్తి టౌన్: పట్టణంలో హనుమజ్జయంతిని ఘనంగా జరుపుకున్నారు. శివప్రసాద్ స్వామి ఆధ్వర్యంలో గణపతి పూజ, స్వస్తి వాచకము, రక్షాధారణ, కలశస్థాపన హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. అభిషేకాలు, ఆకు పూజల అనంతరం పురోహితుడు గురుస్వామి ఆధ్వర్యంలో యజ్ఞం నిర్వహించారు.

నల్లమాడ: పెద్దకోట్లపల్లి ఆంజనేయ స్వామి ఆలయంలో పూజారులు రాజ్‌గోపాల్, సతీష్ ఆంజనేయ స్వామి మూల విరాట్‌ను తమలపాకులు, పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు చేశారు. ఎద్దులవాండ్లపల్లి ఆంజనేయ స్వామి ఆలయంలో అన్నదానం చేశారు.

కొత్తచెరువు: కొత్తచెరువులోని మరువాజంనేయ, కాలువగడ్డ, మైలేపల్లి వద్ద వెలసిన ఆంజనేయస్వామి దేవాలయాల్లో ఆదివారం భక్తులు పెద్ద ఎత్తున చేశారు. కాలువగడ్డ ఆంజనేయ స్వామి దేవాలయంలో స్వామికి వడమాల సమర్పించారు. అనంతరం పి.దివ్యతేజ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

కదిరి అర్బన్: మండల పరిధిలోని పట్నం గ్రామంలో ఆదివారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీకాకుళం నాగరత్నమయ్య ఆధ్వర్యంలో ఆంజనేయస్వామి మూలవిరాట్‌కు అభిషేకం చేపట్టారు.



పుట్టపర్తి టౌన్: దేవాలయంలో యజ్ఞం చేస్తున్న దృశ్యం



ధర్మవరం: పూజలు చేయిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి



ముదిగుబ్బ: ఆంజనేయ స్వామి ఆలయం వద్ద కేక్ కట్ చేస్తున్న దృశ్యం



ధర్మవరం అర్బన్: కాలభైరవ స్వామి ఆలయం వద్ద అన్నదానం



నల్లచెరువు: కదిరి సివిల్ జడ్జి జయలక్ష్మికి స్వామి చిత్రపటాన్ని బహూకరిస్తున్న దృశ్యం

నేటి నుంచి బోగాదమ్మ ఆలయంలో విగ్రహాల ప్రతిష్ట

గాండ్లపెంట: మండల పరిధిలోని కటారుపల్లి పంచాయతీ సాదులవాండ్లపల్లి గ్రామ సమీపంలోని బోగాదమ్మ ఆలయంలో సోమవారం నుంచి రెండు రోజుల పాటు విష్ణుదుర్గ, విఘ్నేశ్వర విగ్రహాల ప్రతిష్ట ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. 15వ తేదీ సాయంత్రం 5 గంటలకు బోగాదమ్మ ఆలయంలో గణపతి పూజ, కలశ స్థాపన, మహామంగళ హారతి, రాత్రికి చెక్కభజన, 16న గోపుర కలశస్థాపన, పుష్పాధి వాసం, తీర్థప్రసాద వినియోగం, రాత్రికి సత్యహరిశ్చంద్ర పౌరాణిక నాటకం, 17న ఉదయం ప్రాణప్రతిష్ట, దర్పణ దర్శనం, పూర్ణాహుతి, రాత్రికి పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి జీవిత చరిత్ర నాటకం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. దాతలు, గ్రామస్తుల సహకారంతో మూడు రోజుల పాటు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

అక్రమంగా మట్టి తరలింపు



మట్టి తరలించడంతో గుంతలు పడిన దృశ్యం

ముదిగుబ్బ: మండల పరిధిలోని గుంజేపల్లి గ్రామ సమీపంలోని కన్నెకలగొంది స్వామి మాన్యం భూముల్లో అక్రమంగా మట్టిని తరలిస్తున్న వాహనాలను ఆదివారం గ్రామస్తులు అడ్డుకున్నారు. కన్నెకలగొంది మాన్యం భూముల్లో చింత, వేప, తుమ్మ చెట్లు అధికంగా ఉన్నాయి. జిల్లేడు బండ నిర్మాణంలో భాగంగా టిప్పర్లతో మట్టిని తరలిస్తున్నట్లు గ్రామస్థులు తెలుసుకుని అడ్డుకున్నారు. దీంతో సదరు కాంట్రాక్టర్ మట్టిని తరలించే వాహనాలను అక్కడ నుంచి తీసుకెళ్లారు.

ఆకట్టుకున్న తాళాల భజన పోటీలు

గార్లదిన్నె: ముకుందాపురంలో శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు నిర్వహించిన రాష్ట్ర స్థాయి తాళాల భజన పోటీలు ఆకట్టుకున్నాయి. పోటీల్లో 29 భజన బృందాలు పాల్గొనగా అలంకొండకు చెందిన అన్నపూర్ణ విశ్వేశ్వర భజన మండలి, ఉయ్యాలవాడకు చెందిన మూల పెద్దమ్మ భజన మండలి,గుర్రపాడుకు చెందిన శీలక్ష్మీనరసింహస్వామి భజన మండలి, శంకరాపురానికి చెందిన శ్రీరామాంజనేయ భజన మండలి, హాళికెరకు చెందిన ఆంజనేయస్వామి భజన మండలి, పెట్నికోటకు చెందిన సీతారామాంజనేయ భక్త మండలి తొలి ఐదు స్థానాల్లో నిలిచాయి. వీరికి వరుసగా రూ.30 వేలు, రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.18 వేలు, రూ.16 వేలు నగదు బహుమతులు అందజేశారు. మొత్తం 21 బృందాలకు నగదు బహుమతి, మిగతా జట్లకు ప్రోత్సాహక బహుమతి అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న గ్రామస్తులు

పద్మశాలీయ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

తాడిపత్రి టౌన్: ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పద్మశాలీయ సామాజిక వర్గానికి చెందిన టెన్త్, ఇంటర్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రతిభా పురస్కార అవార్డులు అందించనున్నారు. ఈమేరకు తాడిపత్రి వరదయ్య పద్మశాలి కమ్యూనిటీ హాల్ కమిటీ అధ్యక్షుడు వద్ది శివ సత్యనారాయణ, సభ్యులు సూర్యనారాయణ, చెన్నారాజగోపాల్, జలదుర్గం దామోదర్‌దాస్ ఓ ప్రకటన విడుదల చేశారు. పదో తరగతిలో 540 మార్కులు అంతకంటే ఎక్కువ మార్కులు, ఇంటర్‌లో 900 కంటే ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులు ప్రతిభా పురస్కార అవార్డుకు అర్హులని పేర్కొన్నారు. ప్రథమ బహుమతి రూ.10 వేలు, ద్వితీయ బహుమతి రూ.7,500, తృతీయ బహుమతి రూ.5 వేలు, మెమొంటో, ప్రశంసాపత్రం అందించనున్నట్లు తెలిపారు. కన్సోలేషన్ బహుమతి కింద ఒక్కొక్కరికి రూ.1,000 తోపాటు ప్రశంసా పత్రం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 31 లోపు శ్రీ వరదయ్య పద్మశాలి కమ్యూనిటీ హాల్ సీబీరోడ్డు తాడిపత్రి చిరునామాకు దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 9848822112,8098985858, సంప్రదించాలని సూచించారు. జూన్ 11న అవార్డుల ప్రదానోత్సవం జరగనున్నట్లు పేర్కొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం ఆర్టీసీ డిపోనకు చెందిన బస్సుకు తృటిలో ప్రమాదం తప్పింది. ఈ సంఘటన ఆదివారం అనంతపురం రోడ్డులో చోటు చేసుకుంది. కళ్యాణదుర్గం డిపోనకు చెందిన హైయర్ బస్సు డ్రైవర్ బస్టాండ్ నుంచి టీ సర్కిల్ మీదుగా సాయిబాబా గుడి వద్దకు అతి వేగంతో వచ్చాడు. బస్సు ముందు వైపు వెళ్తున్న ద్విచక్రవాహనదారులు సైతం బెంబేలెత్తారు. వేగాన్ని అదుపు చేయలేక పెట్రోల్ బంక్ సమీపంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రి వద్ద బస్సును ఆపి డ్రైవర్ పరారయ్యాడు. బస్సులో ఉన్న కండక్టర్ చంద్రికతో పాటు ఓ బాలుడికి గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఆర్టీసీ అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి మరో డ్రైవర్ ద్వారా బస్సును బస్టాండ్‌కు తరలించి, ప్రయాణికులను మరో బస్సులో పంపించివేశారు.

బ్లింకర్స్ ఏర్పాటు

కొత్తచెరువు: రోడ్డు ప్రమాదాలను నివారించడంలో భాగంగా మండల కేంద్రంలోని పుట్టపర్తి, బుక్కపట్నం రహదారుల్లో ఆదివారం బ్లింకర్లను ఏర్పాటు చేశారు. ఎస్పీ ఎస్వీ మాధవ రెడ్డి ఆదేశాలతో సీఐ జయనాయక్ ఆధ్వర్యంలో ఎస్‌ఐ లింగన్న పనులను పర్యవేక్షించారు.

రుణాలు రెన్యూవల్ చేసుకోండి

కదిరి అర్బన్: సైదాపురం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో 2022–23 సంవత్సరం రుణాలు పొందిన రైతులు వడ్డీ చెల్లించి రెన్యూవల్ చేసుకోవాలని ఆ సంఘం అధ్యక్షుడు ఆంజనేయులు, సీఈఓ హనుమంతరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సకాలంలో వడ్డీ చెల్లించి ప్రభుత్వ పథకాలతో లబ్ధి పొందాలని సూచించారు.

వాల్మీకి విద్యార్థులకు ప్రశంసాపత్రాలు

కదిరి టౌన్: ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో 450 మార్కులు, ప్రైవేట్ పాఠశాలల్లో 470 మార్కులు, అలాగే ఇంటర్‌లో 850 మార్కులకు పైగా సాధించిన వాల్మీకి విద్యార్థులకు శ్రీసత్యసాయి జిల్లా వాల్మీకి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ప్రశంసాపత్రాలు అందజేయడం జరుగుతుందని ఆ సంఘం నాయకులు సోమశేఖర్, రామాంజనేయులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 27వ తేదీన పుట్టపర్తి సాయి ఆరాం ఫంక్షన్ హాల్‌లో ప్రశంసాపత్రాలు అందజేస్తామన్నారు. మార్కుల సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రాలను ఈనెల 23వ తేదీలోపు వాట్సాప్‌లో పంపించాలని తెలిపారు. మరిన్ని వివరాలకు సోమశేఖర్ 9441275736, రామాంజనేయులు 9491982526, నరసింహులు 6304037940 నంబర్లకు సంప్రదించాలన్నారు.

యువకుడికి గాయాలు

గుత్తి రూరల్: రజాపురం గ్రామ శివారులో బైక్‌పై నుంచి పడి ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలిలా ఉన్నాయి.. గుంతకల్లు మండలం శంకరబండకు చెందిన అశోక్ శనివారం అర్ధరాత్రి బంధువుల వివాహానికి గుత్తికి వచ్చి తిరిగి స్వగ్రామానికి బయలుదేరాడు. రజాపురం శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై వేగంగా వెళ్తున్న బైక్ అదుపు తప్పికిందపడింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అశోక్‌ను 108 వాహనం ద్వారా గుత్తి అసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు అనంతపురానికి తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు రుక్మిణీ పాండురంగ స్వామి రథోత్సవం

బొమ్మనహాళ్: ఆంధ్ర పండరీపురంగా ప్రసిద్ధి చెందిన ఉంతకల్లు రుక్మిణీ పాండురంగస్వామి రథోత్సవం సోమవారం సాయంత్రం 5 గంటలకు నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు మెట్టు హనుమంతరెడ్డి ఆదివారం తెలిపారు. సోమవారం వైశాఖమాసం బహుళ ఏకాదశి సందర్భంగా ఉదయం రుక్మిణీ పాండురంగస్వామికి క్షీరాభిషేకం, ప్రత్యేక పూజలు, పల్లకీ మహోత్సవం నిర్వహించిన అనంతరం స్వామి రథోత్సవం చేపడతామన్నారు. పండరీపుర పీఠాధిపతి గోపాల్‌రాజ్ ప్రత్యేక పూజలను నిర్వహించిన అనంతరం రథాన్ని లాగుతామన్నారు.

వైభవంగా ఎలవగంప ఉత్సవం

పుట్టపర్తి టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డు బీడుపల్లిలో ఆదివారం అక్కదేవతల ఎలవగంప ఉత్సవాన్ని గ్రామపెద్దల ఆధ్వర్యంలో పూజారి చెన్నప్ప వైభవంగా నిర్వహించారు. ఎలవగంపను ఉరుములు, డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా మేకల చెరువు వద్ద వెలసిన అక్కదేవతల అమ్మవార్ల దేవాలయానికి తీసుకెళ్లారు. భక్తులు కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. సోమవారం ఆలయం వద్ద 7 మంది పసిపిల్లలకు ఒల్లు నింపే కార్యక్రమం, అనంతరం రాజనాలు దంచే కార్యక్రమం నిర్వహించనున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



ఎలవగంపను ఊరేగింపుగా తీసుకెళ్తున్న దృశ్యం

భక్తిశ్రద్ధలతో గోపుర కలశ ప్రతిష్ట



వేదావతి నది వద్ద గంగపూజ నిర్వహిస్తున్న గ్రామస్తులు

రాయదుర్గం రూరల్: మండలంలోని కెంచానపల్లి, కాశీపురం గ్రామాల మధ్య పోలేరమ్మ ఆలయ గోపురానికి ఆదివారం భక్తిశ్రద్ధలతో కలశ ప్రతిష్ట గావించారు. గ్రామానికి చెందిన గాజుల గోవిందప్ప కుమారుల ఆర్థిక సహకారంతో గోపుర కలశం సిద్ధం చేయించారు. గోపుర కలశ ప్రతిష్ట సందర్భంగా ఆలయంలో బెంగళూరుకు చెందిన వేద పండితులు శాంతి హోమం, రుద్రహోమం, నవగ్రహ హోమం చేపట్టారు. గోపుర కలశాన్ని గ్రామంలో ఊరేగించి, వేదావతి నది వద్ద గంగపూజ గావించిన అనంతరం ఆలయం వద్దకు తీసుకెళ్లి పండితుల సమక్షంలో ప్రతిష్ఠించారు. అనంతరం అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో గాజుల లక్ష్మీపతి, గాజుల వెంకటేశులు, అడ్వకేట్ గాజుల ఆదెన్న, గాజుల నాగభూషణ, గాజుల రామ్మూర్తి , గోపాలప్ప, సూర్య ప్రకాష్, నారాయణ స్వామి, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని ఇద్దరికి గాయాలు



జాతీయ రహదారిపై బోల్తా పడిన ట్రాక్టర్

కనగానపల్లి: జాతీయ రహదారిపై మొక్కలకు నీరు పెడుతున్న ట్రాక్టర్‌ను లారీ ఢీకొట్టింది. దీంతో నీటి ట్యాంకర్‌తో పాటు ట్రాక్టరు బోల్తా పడింది. స్థానికులు తెలిపిన మేరకు.. రామగిరి మండలం కుంటిమద్దికి చెందిన కాంట్రాక్టర్ చంద్ర ఆదివారం తన ట్రాక్టరుతో జాతీయ రహదారిపై ఉన్న మొక్కలకు నీరు పెడుతున్నాడు. ఈ సమయంలో జాతీయ రహదారిపై వేగంగా వచ్చిన లారీ ట్రాక్టరుకు వెనుక వైపు ఉన్న నీటి ట్యాంకరును ఢీకొట్టింది. దీంతో ట్యాంకర్‌తో పాటు ట్రాక్టరు ఇంజిన్ కూడా బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ట్రాక్టరులో ఉన్న చంద్రతో పాటు లారీ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. కనగానపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఇళ్ల నిర్మాణాలకు నేడు భూమి పూజ

తలుపుల: స్థానిక జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలకు సోమవారం ఉదయం 10:30 గంటలకు ఎమ్మెల్యే డా.పి.వి సిద్దారెడ్డి భూమి పూజ చేస్తారని ఎంపీపీ రఫీనాయక్, ఎంపీడీఓ రామానాయక్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

ఆరో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

అమడగూరు: మండలంలోని గాజుబండ సమీపంలోని ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 25 లోపు ఓసీ, బీసీ కులాల వారు రూ.150, ఎస్సీ, ఎస్టీ కులాల వారు రూ.75 ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. జూన్ 11వ తేదీ సంబంధిత పాఠశాలలోనే ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు.

వైద్య చికిత్సకు ఆర్థికసాయం అందజేత

నల్లచెరువు: అనంతపురం నగరానికి చెందిన చిన్నారి అమీన.. ఎడినో వైరస్ సోకి బెంగళూరులోని సెయింట్ జాన్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న నల్లచెరువుకు చెందిన డాక్టర్ బీఎస్ లలిత్ చంద్రా టీం సభ్యులు సానే అమర్‌నాథ్ రెడ్డి, శ్రీకాంత్ ఆదివారం బెంగళూరుకు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం చికిత్స నిమిత్తం రూ.58 వేలు ఆర్థికసాయం అందజేశారు.

దాదులూరు పోతలయ్యకు పూజలు



పూజలందుకుంటున్న పోతలయ్య స్వామి

కనగానపల్లి: దాదులూరు పోతలయ్యస్వామికి భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టు గ్రామాల నుంచి వచ్చిన భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేసి బోనాలు సమర్పించారు. తర్వాతా ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి స్వామిని దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్ని సౌకర్యాలు కల్పించారు.

నేడు తుమ్మచెట్ల వేలం

ఎన్పీ కుంట: మండల పరిధిలోని ఎస్.రెడ్డివారిపల్లి గ్రామం కొత్తకుంట వద్ద గల నల్ల తుమ్మచెట్లు కొట్టుకునేందుకు సోమవారం వేలం పాట నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శులు రమేష్, ముబారక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్.పి.కుంట–2 సచివాలయంలో ఉదయం 11 గంటలకు సర్పంచ్ అంజినమ్మ, ఈఓఆర్డీ మనోహర్ అధ్యక్షతన వేలం పాట జరుగుతుందన్నారు. మొత్తం 96 నల్ల తుమ్మ చెట్లు ఉన్నాయని తెలిపారు. ఆసక్తి గలవారు రూ.10 వేలు డిపాజిట్ చెల్లించి, వేలం పాటలో పాల్గొనాలని సూచించారు. వేలం దక్కించుకున్న వారు మొత్తం రుసుము చెల్లించి, రసీదు పొందాలన్నారు.

28న రాయలసీమ మహాకవి సమ్మేళనం

అనంతపురం కల్చరల్: ఈనెల 28న రాయలసీమ సాంస్కృతికోద్యమంలో భాగంగా మహాకవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత డాక్టర్ అప్పిరెడ్డి హరినాథ రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రాయలసీమ సాంస్కృతిక వేదిక, వేమన అధ్యయన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో జరిగే కవి సమ్మేళనంలో పాల్గొనేవారు తమ కవితలను ఈనెల 25లోపు సెల్ : 9962544299లో పంపాలన్నారు.